News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :71 | ఖమ్మం | ఆదివారం, ఏప్రిల్ 26, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన' ఆవిర్భావం..

## కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు

- తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన కవిత
- బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్న ఆరోపణ
- కేసీఆర్ మారిపోయారని, ఆయన మన మనిషి కాదంటూ తీవ్ర విమర్శలు
- సామాజిక తెలంగాణే లక్ష్యమని, రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా
- తప్పకుండా తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేసిన కవిత



తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో తన పార్టీని ప్రకటించి, రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆమె పార్టీ పేరును, జెండాను ఆవిష్కరించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో కూడిన జెండా మధ్యలో తెలంగాణ మ్యాప్, దానిపై టీఆర్ఎస్ అనే అక్షరాలు ఉన్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కవిత మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ, దాని నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను పూర్తిగా కోల్పోవడం వల్లే తాను కొత్త పార్టీ పెట్టాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడైన కేసీఆర్ అభివృద్ధి రథం గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన కొన్ని తప్పుల్లో భాగస్వామినేనని అంగీకరిస్తూ, ఇప్పుడు ఆ తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు."ప్రస్తుతం ఉన్న కేసీఆర్ ఒకప్పటి కేసీఆర్ కాదు. ఆయన 'మర మనిషి'గా మారిపోయారు, మన మనిషి కాదు. ఆయన గుంట నక్కల చేతిలో ఖైదీగా మారారు" అంటూ కవిత తన తండ్రిపై సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రజలు కష్టాల్లో ఉంటే కేసీఆర్ పట్టించుకోవడం లేదని, అధికారం ముందు మమకారం తగ్గిపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తాను హెచ్చరించినా, తనను పక్కనపెట్టి 'పందికొక్కులను' అందలం ఎక్కించారని మండిపడ్డారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసి మంచి పని చేశారని, ఇప్పుడు తన రాష్ట్రం కోసం స్వేచ్ఛగా పోరాడతానని అన్నారు.

సామాజిక తెలంగాణ సాధనే తమ పార్టీ లక్ష్యమని కవిత ప్రకటించారు. రాష్ట్రంలోని మూడున్నర కోట్ల మందికి 'అమ్మ'గా మారి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాము ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, రెండేళ్లలో కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాను తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేశారు. పార్టీ ప్రకటనకు ముందు కవిత తన బంజారాహిల్స్ నివాసంలో సర్వమత ప్రార్థనలు చేసి, గన్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

## 'ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!'.. కవిత పార్టీపై బీఆర్ఎస్ కౌంటర్




తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్(తెలంగాణ రాష్ట్ర సేన)పై బీఆర్ఎస్ పార్టీ పరోక్షంగా స్పందించింది. 'ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!' అంటూ కోల్గేట్, బిస్లరీ ఒరిజినల్, వాటికి సంబంధించిన ఫేక్ ప్రోడక్స్ ఫోటోలను బీఆర్ఎస్ షేర్ చేసింది. రాష్ట్రంలో అసలైన పార్టీ తమదేనని బీఆర్ఎస్ పరోక్షంగా చెప్పింది. ఈ మేరకు కవిత పార్టీ అనౌన్స్ చేసిన కొద్ది సేపటికే బీఆర్ఎస్ పార్టీ ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చింది.

**ఏది ఒరిజినల్, ఏది డూప్లికేట్..!**

ప్రస్తుతం ట్వీట్ వైరల్ అవుతోంది. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తీవ్ర స్థాయిలో స్పందిస్తున్నారు. 'ఒరిజినల్ బ్రాండ్స్‌కు ఉన్న పాపులారిటీని క్యాష్ చేసుకోవాలని, తొందరగా డబ్బు సంపాదించాలని కొంతమంది ఇలా (కోల్గేట్, బిస్లరీ) ఫేక్ బ్రాండ్స తయారు చేసి అమ్మడానికి ప్రయత్నిస్తుంటారు. ప్రజలు ఏది ఒరిజినల్, ఏది డూప్లికేట్ తెలుసుకోలేనంత అమాయకులు కాదు!' అంటూ బీఆర్ఎస్ శ్రేణులు పరోక్షంగా కౌంటర్ ఇస్తున్నారు. కాగా,శనివారం ఉదయం మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో కవిత తన పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన' గా ప్రకటించారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం - మిగతా 2లో...

# అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్

- మంత్రి పదవిపై కోదండరాం ఏమన్నారంటే..!
- కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదం
- తనకు మంత్రి పదవిపై ఆశ లేదన్న కోదండరాం
- ప్రజా ప్రయోజనాలే తనకు ముఖ్యమని వ్యాఖ్య




గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రొఫెసర్ కోదండరాం, టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్‌ల అభ్యర్థిత్వాలను రాష్ట్ర గవర్నర్ ఆమోదించారు. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా మరికొద్ది సేపట్లో విడుదల కానుంది. ఎమ్మెల్సీగా నియామకం ఖరారైన అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవిపై ఎలాంటి ఆశ లేదని, ప్రజా సమస్యలపై గొంతు వినిపించేందుకే ఎమ్మెల్సీ బాధ్యతను స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. వ్యక్తిగత లాభం కంటే ప్రజా ప్రయోజనాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు.మరోవైపు, ఇప్పటికే మంత్రిగా కొనసాగుతున్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ సీటు ఖరారు కావడంతో పెద్ద ఊరట లభించింది. అన్ని చిక్కులు తొలగిపోవడంతో ప్రభుత్వం కూడా ఊపిరి పీల్చుకుంది. గెజిట్ విడుదలైన తర్వాత వీరిద్దరూ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## బీజేపీకి ఏమికాదు.. కవిత పార్టీపై రాంచందర్‌రావు సెటైర్స్

### కవిత పార్టీ ప్రకటన... స్పందించిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు

### ఎన్ని పార్టీలు పుట్టుకువచ్చినా బీజేపీకి ఇబ్బంది లేదన్న రామచందర్ రావు

### తెలంగాణలో బీజేపీకి మంచి వాతావరణం ఉందని వ్యాఖ్య

### తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కవిత తన కొత్త పార్టీని ప్రకటించడంపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నా, కొత్త పార్టీలు పుట్టుకువచ్చినా బీజేపీకి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని అన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి వాతావరణం ఉందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పన్నెండేళ్లుగా అవినీతిరహిత పాలనను అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలామంది పార్టీలు పెడుతున్నారని, ఇప్పుడే ఒకరు పార్టీని ప్రకటించారని తెలిపారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని ఎద్దేవా చేశారు. గతంలో టీఆర్ఎస్, ఇప్పుడు బీఆర్ఎస్ అయిందని, ఇప్పుడు వారి బిడ్డ పెట్టే పార్టీ కూడా టీఆర్ఎస్ అని చురక అంటించారు. దేశంలో అవినీతిరహిత పాలన ఇస్తోంది బీజేపీ మాత్రమే అన్నారు.

# తెలంగాణలోని ప్రతీ ఇంటిని లెక్కిస్తాం

### తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామన్న తెలంగాణ డైరెక్టర్

### ఒక భవనంలో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడి

### 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశ జనగణన




జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె జనాభా లెక్కల సేకరణ వివరాలను శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామని ఆమె వెల్లడించారు. ప్రతి నిర్మాణాన్ని లెక్కలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా అన్నింటి గణన జరుగుతుందని వెల్లడించారు. అలాగే ఒక భవనం లేదా కాంప్లెక్స్‌లో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన మొదలయ్యేలోగా అన్నీ సిద్ధం చేస్తామని తెలిపారు. రెండో దశ జనగణనలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచా రాన్ని సేకరిస్తామని అన్నా రు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కింగ్ చేస్తారని తెలిపారు.ప్రతి ఇంటికి వెళ్లి జనగణనకు సంబంధించిన యాప్ ద్వారా 33 ప్రశ్నలను అడిగి వాటిని పూరిస్తారని చెప్పారు. జనగణనకు సంబంధించి ఒక ఇంటి నుంచి ఒక మొబైల్ నెంబర్ తీసుకుంటామని చెప్పారు. భాషను, ఇంటి పెద్దల వివరాలు సరిగ్గా ఇవ్వాలని సూచించారు. మొబైల్ నెంబర్, భాష, ఇంటి పెద్ద పేర్లను ఒకసారి నమోదు చేస్తే, వాటిని మార్చడానికి వీలుండదని తెలిపారు.

# దేశంలో ఫస్ట్: కేసీఆర్-కవిత.. తండ్రి-కూతురు రాజకీయం!

**హైదరాబాద్** : బి ఆర్ ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు పెద్ద సవాల్ ఎదురైంది. ఇప్పటివరకు ఆయన అనేకమంది నాయకులతో.. అనేక పార్టీలతో రాజకీయంగా యుద్ధం చేశారు. కేంద్రంలోని బిజెపితో కావచ్చు, గతంలో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కావచ్చు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో కావచ్చు. లేదా ఉద్యమ సమయంలో టిడిపి తో కావచ్చు.. ఇలా పలు పార్టీలతో ఆయన విభేదించారు. రాజకీయంగా పోరాటం చేశారు. ఇదంతా ఒక ఎత్తు అయితే ఇప్పుడు తన జీవితంలో తన సొంత బిడ్డతోనే రాజకీయం చేయాల్సి రావడం, సమాధానం చెప్పాల్సి రావడం, వివరణ ఇవ్వాల్సి రావడం అనేది ఊహించని పరిణామం అని చెప్పాలి. ఎందుకంటే కవిత పార్టీ పెట్టినప్పటికీ కేసీఆర్ జోలికి పోదని కేసీఆర్ను పెద్దగా విమర్శించరని అందరూ అనుకున్నారు. రాజకీయ పండితులు సైతం అంచనా వేశారు. కేసీఆర్ జోలికి వెళితే ఆమెకే నష్టమని కూడా కొన్ని విశ్లేషణలు వచ్చాయి. కానీ, అనూహ్యంగా కెసిఆర్ ను టార్గెట్ చేయడం.. కేసీఆర్‌ను -మన మనిషి కాదు, మరమనిషి- అని చెప్పడం ద్వారా కేసీఆర్ వ్యతిరేకతను భారీ స్థాయిలో పెంచే ప్రయత్నం చేయటం కవిత రాజకీయాల్లో ఇప్పుడు కీలక అంశంగా మారింది. ఒకవైపు కేసీఆర్, పోయిన తన అస్తిత్వాన్ని దక్కించుకునేందుకు, ఓటు బ్యాంకు ను తిరిగి సంపాదించుకునేందుకు కాంగ్రెస్‌పై వ్యతిరేకతను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన త్వరలోనే ప్రజా బాహుళ్యంలోకి వచ్చేందుకు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటువంటి సమయంలో అనూహ్యంగా కవిత రూపంలో కేసీఆర్‌ను లక్ష్యంగా పెట్టుకొని.. ఆయన పది సంవత్సరాల పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతోపాటు నీళ్లు.. నిధులు.. నియామకాలతో పాటు సామాజిక న్యాయం అనే అంశాలను ప్రధానంగా చర్చకు పెట్టడం ద్వారా కేసీఆర్ ను రాజకీయంగా ఇరుకునపెట్టిన పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు ఈ విషయాలపై బీఆర్ఎస్ తరఫున ఎవరు మాట్లాడినప్పటికీ అంతగా ప్రయోజనం కనిపించదు. కేసీఆరే స్వయంగా రావాలి. కవిత చేసిన వ్యాఖ్యలకు ఆయనే సమాధానమైనా చెప్పాలి లేదా ప్రతి విమర్శలు అయినా చేయాలి. అంటే తన బిడ్డ రాజకీయాలకు తానే ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఒకరకంగా చెప్పాలంటే కెసిఆర్ కు కొత్త చిక్కును తీసుకువచ్చిందనే చెప్పాలి. మరి దీన్ని ఏ విధంగా ఎదుర్కొంటారు.. ఎలా ముందుకు సాగుతారు.. రాజకీయంగా కేసీఆర్ -కవితల మధ్య ముమ్ముందు ఎటువంటి పరిస్థితులు ఏర్పడతాయి అనేవి చూడాలి.



ముఖ్యంగా ఎన్నికల సమయానికి ఈ పరిణామాలు ఏ విధంగా మారుతాయి అనేవి చాలా ఆసక్తిగా కూడా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీతో రాజకీయం చేయడం వేరు. బిజెపితో రాజకీయం చేయడం వేరు. కానీ సొంత బిడ్డతో రాజకీయం చేయడం బహుశా ఈ దేశంలో ఇదే మొదటిసారి అయి ఉంటుందన్నది రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అన్నా చెల్లెల మధ్య ఏపీలో గొడవ జరుగుతోంది. తెలంగాణలోను అన్న చెల్లెల మధ్య గొడవ జరుగుతోంది. అది వేరు. కానీ, కన్నతండ్రి మీద కుమార్తె... కుమార్తెకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితిలో కన్నతండ్రి ఈరోజు రాజకీయ పరిస్థితిని ఎదుర్కొంటారు.

# భూముల విలువల సవరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 25, :**
తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను మే మొదటి వారం నుంచి సవరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘం దీనిపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య చైనా తరహా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు 'హిల్ట్' విధానం ద్వారా పారదర్శక పద్ధతిలో భూ వినియోగ మార్పిడి చేపడతామని స్పష్టం చేసింది. పారిశ్రామికవేత్తల సూచనల మేరకు రాయితీలు, కొత్త జోన్ల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణలో ఆదాయ వనరుల పెంపుదల, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం దూకుడు పెంచింది. మే మొదటి వారం నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురావాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు పారిశ్రామిక ఎస్టేట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తూనే.. భూ విలువల సవరణ ద్వారా ఖజానాకు అదనపు ఆదాయాన్ని చేకూర్చడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం చెబుతోంది. పారిశ్రామిక రంగానికి సంబంధించి అనేక వినూత్న ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాలను చైనా తరహాలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులుగా అభివృద్ధి చేయాలని పారిశ్రామికవేత్తలు కోరగా.. ప్రభుత్వం దానికి సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ విధానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎటువంటి నగదు బదిలీలకు తావులేకుండా అమలు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పరిశ్రమల వల్ల కాలుష్యం ఉండకూడదని అదే సమయంలో అవి లాభసాటిగా నడవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అయితే హిల్ట్ పాలసీపై రాజకీయంగా తలెత్తుతున్న కొన్ని విమర్శలను పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు కొట్టిపారేశారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విధానం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని కొందరు నేతలు భయపెట్టే ప్రయత్నం చేశారని కానీ పారదర్శకమైన ఈ విధానంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని తాము భావిస్తున్నట్లు తెలిపారు. భూ వినియోగ మార్పిడి ఛార్జీలను రోడ్డు విస్తీర్ణాన్ని బట్టి 30 శాతం నుంచి 50 శాతం వరకు నిర్ణయించారని అయితే వీటిని స్వల్పంగా తగ్గించాలని పారిశ్రామికవేత్తలు విజ్ఞప్తి చేశారు. రాయితీలు ఇవ్వకపోయినా సరే పరిశ్రమల స్థాపనకు తగినంత భూమిని కేటాయించాలని వారు కోరారు. మరోవైపు, రాష్ట్రంలోని అన్ని శాఖల పరిధిలో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమణకు గురైన ప్రాంతాలు, ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న స్థలాల డేటాను సిద్ధం చేయాలని సూచించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయాలు రాష్ట్రంలో పారిశ్రామిక రూపురేఖలను మార్చడమే కాకుండా.. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉంది.

## సెంటిమెంట్ మళ్ళీ పురుడుపోసుకుంటుందా?

# కవిత పార్టీకి స్పేస్ ఉందా

**హైదరాబాద్, ఏప్రిల్ 25, :**
తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక అంకం మొదలైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి మూడు బలమైన శక్తులు ఉన్న చోట.. నాలుగో శక్తి గా కవిత ఏ మేరకు రాణిస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలంగాణలో ప్రస్తుతం త్రిముఖ పోటీ నెలకొంది. అధికారం కోల్పోయినా కేడర్ బలంగా ఉన్న బీఆర్ఎస్, అధికారంలో ఉన్న కాంగ్రెస్, పుంజుకుంటున్న బీజేపీ మధ్య రాజకీయ యుద్ధం నడుస్తోంది. ఈ దశలో కవిత కొత్త పార్టీని ప్రకటించడం సాహసోపేతమైన నిర్ణయంగానే కనిపిస్తోంది. అయితే, తెలంగాణ రాజకీయాల్లో స్పేస్ ఎప్పుడూ ఉంటుంది. ముఖ్యంగా సెంటిమెంట్, ప్రాంతీయ ఆకాంక్షలు బలంగా ఉన్న గడ్డపై, గొంతు లేని వర్గాలకు , అసంతృప్త నేతలకు కవిత పార్టీ ఒక వేదికగా మారే అవకాశం ఉంది. ప్రత్యేకించి మహిళా సాధికారత, తెలంగాణ సంస్కృతిని అజెండాగా మార్చుకుంటే కొంత మేర ఓటు బ్యాంకును ఆకర్షించవచ్చు. కవిత నిర్ణయం అన్నిటికంటే ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీనే ప్రభావితం చేయనుంది. కేసీఆర్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న నేతలు లేదా పార్టీలో ప్రాధాన్యత దక్కని సెకండ్ లైన్ లీడర్లు కవిత వైపు చూసే అవకాశం ఉంది. పార్టీ పేరులో తెలంగాణ ఉంటుంది. ఇది బీఆర్ఎస్ ఓటు బ్యాంకును చీల్చితే, అది పరోక్షంగా కాంగ్రెస్ , బీజేపీకి లాభం చేకూర్చవచ్చు. తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత ఆమె తీసుకుంటున్న ఈ అడుగు, తెలంగాణలో ఒక కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలకవచ్చు. కవిత తన తాజా వ్యాఖ్యల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. తెలంగాణలో జనాభా పరంగా పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ సామాజిక వర్గాలను తన వైపు తిప్పుకోవడం ద్వారా బలమైన పునాది వేయాలని ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీలు కూడా బీసీ మంత్రాన్ని జపిస్తున్న తరుణంలో, కవిత తెలంగాణ బిడ్డ గా వారి ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తారనేది కీలకం. ఆమె పార్టీలో చేరబోతున్న మేధావులు, ఉద్యమకారుల జాబితాను బట్టి ఈ పార్టీ గమ్యం దిశానిర్దేశం అవుతుంది. తెలంగాణ జాగృతి ద్వారా దశాబ్ద కాలంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కవితకు క్షేత్రస్థాయిలో ఒక నెట్‌వర్క్ ఉంది. ఉద్యమ సమయంలో పనిచేసిన వారు, ప్రస్తుతం రాజకీయంగా అవకాశాలు లేని వారు ఆమె వెంట నడిచే అవకాశం ఉంది. ఒకవేళ ఆమె బలమైన అభ్యర్థులను నిలబెట్టి, ఒక పది నుంచి పదిహేను శాతం ఓట్లు సాధించగలిగితే.. రాష్ట్రంలో ఏ పార్టీ అయినా ప్రభుత్వ ఏర్పాటుకు ఆమె మద్దతు కోరాల్సిన పరిస్థితి వస్తుంది. అంటే కింగ్ మేకర్ గా ఎదిగే అవకాశం ఆమెకు ఉంటుంది తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు త్రిముఖ పోటీ నుంచి చతుర్ముఖ పోటీ వైపు మళ్లుతున్నాయి. ఈ మార్పు తెలంగాణ ఓటరు నాడిని ఎలా మారుస్తుందో వేచి చూడాలి. ముఖ్యంగా మహిళా నేత నేతృత్వంలో వస్తున్న మొదటి ప్రాంతీయ పార్టీగా ఇది ఏ మేరకు సక్సెస్ అవుతుందో త్వరలోనే క్లారిటీ వస్తుంది.



**టార్గెట్ క్లియర్**
సాధారణంగా కొత్త పార్టీలు అధికార పార్టీని విమర్శించడం ద్వారా ఉనికిని చాటుకుంటాయి. కానీ కవిత మాత్రం అధికార కాంగ్రెస్‌ను , దూకుడుగా ఉన్న బీజేపీని కాకుండా, బీఆర్ఎస్ మీదనే ఎక్కువ దృష్టి సారించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు సిద్ధాంతపరంగా ఆమె వైపు వచ్చే అవకాశం లేదని, అలాగే బీజేపీ హిందూత్వ ఓటు బ్యాంకు తన దరి చేరదని ఆమెకు బాగా తెలుసు. అందుకే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ వెన్నంటి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును, ఆ పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న శ్రేణులను తన వైపు తిప్పుకోవడమే ఆమె సింగిల్ పాయింట్ అజెండా గా కనిపిస్తోంది. బీఆర్ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో కవిత ఎంట్రీ ఆ పార్టీకి పెనుగండంగా మారేలా ఉంది. బీఆర్ఎస్ వైఫల్యాలను, ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు జరిగిన అన్యాయాన్ని ఆమె పదే పదే ప్రస్తావిస్తుండటం యాధృచ్ఛికం కాదు. రేజరగబోయే ఆవిర్భావ సభలో కూడా ఆమె ప్రసంగం బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాగే అవకాశం ఉంది. తండ్రి చాటు బిడ్డగా కాకుండా, తెలంగాణ ఆకాంక్షలను మోసే స్వతంత్ర గళంగా తనను తాను ఆవిష్కరించుకోవడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌లో చీలిక తీసుకురావడమే ఆమె అసలు ప్లాన్. రాజకీయాల్లో కేవలం సెంటిమెంట్‌తోనే ఓట్లు పడవని గుర్తించిన కవిత, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడిన చోట తన పట్టును పెంచుకోవాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురైతే, అది కాంగ్రెస్‌కో లేదా బీజేపీకో వెళ్లకుండా తన కొత్త పార్టీ ఒక షెల్టర్ లాగా ఉపయోగపడాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ వ్యూహం గనుక పారితే, బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే, బీఆర్ఎస్ పునాదుల మీదనే తన రాజకీయ సౌధాన్ని నిర్మించుకోవాలని కవిత గట్టి నిర్ణయానికి వచ్చారు.
రాజకీయాల్లో బంధుత్వాలు ఉండవు.. కేవలం బాధ్యతలే ఉంటాయి అనే సంకేతాన్ని కవిత ఇప్పటికే ఇచ్చారు. కేసీఆర్ అనుసరించిన కొన్ని విధానాలను ఆమె బహిరంగంగానే తప్పుపట్టడం ద్వారా, తాను బీఆర్ఎస్ బి-టీమ్ కాదనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఆవిర్భావ సభ తర్వాత ఆమె చేపట్టబోయే కార్యక్రమాలు కూడా బీఆర్ఎస్ కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లోనే ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేశారు. ఇది కచ్చితంగా గులాబీ దళానికి ఒక హెచ్చరిక లాంటిదే. కవిత రాజకీయ చదరంగంలో తొలి పావును అత్యంత తెలివిగా కదిపారు. ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలను వదిలేసి, తన సొంత ఇంటి ఓటు బ్యాంకుపైనే ఆమె యుద్ధం ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది. రేపటి సభలో ఆమె ప్రకటించబోయే పార్టీ పేరు, విధివిధానాలు బీఆర్ఎస్ భవిష్యత్తును ఏ మేరకు ప్రభావితం చేస్తాయోనన్న ఆందోళన ఇప్పుడు ఆ పార్టీ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కవిత కొత్త ప్రయోగం' విజయవంతమైతే, తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవడం అత్యంత కష్టతరంగా మారవచ్చు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం

- మొదటి పేజి తరువాయి
సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు.
ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.

# ఆస్తులతో పాటు అప్పులు....

**హైదరాబాద్, ఏప్రిల్ 25, :** తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు తన సొంత రాజకీయ పార్టీతో ప్రజల పరీక్షను ఎదుర్కోనున్నారు. అయితే ఆమెకు ఉన్న ఆస్తులు ఎన్ని, ఆమె ఇన్‌కమ్ సోర్స్ ఏంటనే చర్చ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో గతంలో అంటే ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం కొన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి.. కవిత ఆస్తులు గత కొన్నేళ్లుగా అనూహ్యంగా పెరిగాయి. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఆమె మొత్తం ఆస్తుల విలువ 7. 63 కోట్లుగా ఉంది. అయితే 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి ఆస్తులు పెరిగినట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అప్పుడు చెప్పిన వివరాల ప్రకారం ఆమె ఆస్తులు విలువ 39.79 కోట్లు దాటింది. అంటే కేవలం ఆ మూడేళ్ల వ్యవధిలోనే ఆమె ఆస్తులు దాదాపు రెట్టింపు కంటే ఎక్కువ పెరిగాయి. ఇందులో చరాస్తుల విలువ రూ. 14. 78కోట్లు కాగా, స్థిరాస్తుల విలువ 5.70 కోట్లుగా ఉంది. కవిత వాహనాల వినియోగంపై కూడా ప్రజల్లో ఆసక్తి ఉంది. ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ఆమె వద్ద టయోటా ఫార్చ్యునర్ కారు ఉంది. దీని విలువ సుమారు 7.58 లక్షలుగా చూపారు. ప్రస్తుతం ఆమె వద్ద ఉన్న కార్ల సమాచారం అందుబాటులో లేదు. అయితే ఆమె భద్రత దృష్ట్యా ప్రభుత్వం కల్పించిన వాహనాలపై అప్పట్లో దుమారం రేగింది. మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో 2016లో ఆమెకు బుల్లెట్ ప్రూఫ్ పార్చ్యునర్ వాహనాన్ని కేటాయించారు అంతేకాకుండా బీఆర్ఎస్ హయాంలో కొనుగోలు చేసిన 22 ల్యాండ్ క్రూయిజర్ వాహనాల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ వాహనాలు కేసీఆర్ కాన్వాయ్ కోసం కొనుగోలు చేశారని ప్రస్తుతం ప్రభుత్వం ఆరోపించగా, భద్రతా ప్రోటోకాల్‌లో భాగంగానే నిఘా వర్గాలు వీటిని ఏర్పాటు చేసినట్టు కవిత స్పష్టం చేశారు. కవిత కేవలం రాజకీయ నేతగానే కాకుండా తనను తాను బిజినెస్ ఉమెన్‌గా కూడా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆమె పెట్టుబడులు ప్రధానంగా రియల్ ఎస్టేట్, ఫార్మా రంగాల్లో ఉన్నాయి. స్ట్రక్చర్ డెవలపర్స్‌లో ఆమెకు 4.99 కోట్ల విలువైన వాటాలు ఉన్నాయి. నెట్‌పిక్సెల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆమె పెట్టుబడులు పెట్టారు. రిలిక్సర్ ఫార్మస్యూటికల్స్‌లో ఆమె భర్త అనిల్ కుమారు ప్రధాన భాగస్వామిగా ఉన్నారు. ఇందులో సుమారు 9.21 కోట్ల పెట్టుబడి ఉంది. వీటితోపాటు, భారత్ జాగృతి ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక కార్యక్రమాల్లో కూడా ఆమె చురుగ్గా పాల్గొంటున్నారు. కవిత తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో విలువైన భూములు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని మల్లె బోయినపల్లిలో తన తండ్రి కేసీఆర్ బహుమతిగా ఇచ్చిన పది ఎకరాల 16 గుంటల వ్యవసాయ భూమి ఆమె పేరిట ఉంది. వీటితోపాటు నిజామాబాద్, కరీంనగర్, సిద్ధిపేట జిల్లాలో కూడా వ్యవసాయ భూములు ఉన్నాయి. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో నివాస భవనంతోపాటు సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులో వాణిజ్య భవనాలు కూడా ఆమె ఆస్తుల జాబితాలో ఉన్నాయి. కవిత వద్ద 1.95 కిలోల బంగారం, డైమండ్ ఆభరణాలు ఉన్నట్టు అఫిడవిట్ పేర్కొంది. అలాగే 11.2 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు 70.71 లక్షలుగా అప్పట్లో లెక్కించారు.
కవిత పేరుతో భారీగా అప్పులు
ఆస్తులు పెరుగుదలతోపాటు ఆమె అప్పులు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఆమెపై మొత్తం రూ. 21. 62 కోట్ల మేర రుణం ఉంది. ఇందులో బ్యాంక్ ఆఫ్ బరోడాలో తీసుకున్న కార్ లోన్(10.18లక్షలు), గోల్డ్ లోన్ (24 లక్షలు) రూ. 1.16 కోట్ల మార్టిగేజ్‌లోన్ ఉన్నాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు కోసం ఆమె 7 కోట్ల మేర అప్పు చేశారు. కవిత 1978లో కరీంనగర్‌లో జన్మించారు. జేఎన్టీయూ నుంచి బీటెక్ పూర్తి చేసిన ఆమె, అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ సదరన్ మిస్సిస్సిపీ నుంచి మాస్టర్ డిగ్రీ పొందారు. 2004లో భారత్‌కు తిరిగి వచ్చి ఆమె తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించి మలి దశ తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. కవిత ఆస్తుల లెక్కలు 2021లో ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం ఉన్నాయి. ఇప్పుడు వీటిలో చాలా మార్పులు జరిగి ఉంటాయి.

# జర్నలిస్టులకు ఆరోగ్య శిబిరం

జర్నలిస్టుల ఆరోగ్యం, సంక్షేమ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. హైదరాబాద్ బేగంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్ లో నిర్వహించిన మెగా జర్నలిస్టుల ఆరోగ్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడికి లోనవుతుంటారని , వారి కోసం ప్రత్యేకంగా ఇలాంటి సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కావడం విశేషమన్నారు. జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రభుత్వం--ప్రజల మధ్య వారధిగా నిలుస్తున్నారని, కష్టసాధ్యమైన పరిస్థితుల్లో పనిచేసే మీడియా ప్రతినిధుల ఆరోగ్యం కాపాడటం అత్యవసరమని ఆమె అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. హైదరాబాద్ జిల్లాలో 94 మంది జర్నలిస్టులకు ?94 లక్షలు ఆర్థిక సహాయం, 17 మందికి అనారోగ్య సహాయం అందించామని చెప్పారు.

## పొన్నారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



**సీకే న్యూస్ ఏప్రిల్ 25** ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమన్న గారు, ఇచ్చోడ ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ గారితో కలిసి కీర్తి గంగమ్మ ప్రభాకర్ గారి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు

ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గృహం లేని కుటుంబాలకు సొంత ఇల్లు కలగడం ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి దిశగా ఇలాంటి కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఉప సర్పంచ్ రామ్ రెడ్డి,నాయకులు గంగన్న ,కౌడల సంతోష్, లింగారెడ్డి ,రామ్ రెడ్డి, కృష్ణారెడ్డి, విలాస్,అశోక్,ధనుంజయ్, సాగర్,రామన్న యాదవ్ , ఉన్నారు

## ఆర్య వైశ్య సంఘం నాయకులతో కలిసి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



**సీకే న్యూస్ ఏప్రిల్ 25** ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 25 కోట్లు కేటాయించి అభివృద్ధికి కొత్త దారులు తీసుకొంచింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు – ఆడే గజేందర్

నేడు బోథ్ నియోజకవర్గంలో తాంసి మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాసవి మాత జయంతిని అధికారికంగా జరుపుకోవాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గారు ఆర్య వైశ్య సంఘం నాయకులతో కలిసి పాల్గొన్నారు

ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ, ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.25 కోట్ల నిధులు కేటాయించడం, ఐదు మున్సిపల్ చైర్మన్ పదవులు మరియు ఒక కార్పొరేషన్ చైర్మన్ నియామకం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఆర్యవైశ్యులను ఈ విధంగా గుర్తించలేదని, సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవడం ద్వారా ఆర్యవైశ్యుల గౌరవాన్ని పెంచారని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధికి కొత్త దారులు తీసుకొచ్చారని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

## సోమదేవరపల్లి లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సి కె న్యూస్ ఏప్రిల్ 25 శనివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్.** స్థానిక సోమదేవరపల్లి గ్రామంలో కీర్తి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీసీ సంపతయ్య శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీసీ సంపతయ్య మాట్లాడుతూ రైతులు ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకుని తమ వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర దొడ్డు రకం 2369,సన్న రకం 2389 రూపాయలకు విక్రయించి లాభపడాలని,సన్న రకానికి 500 రూపాయలు బోనస్ గా ఇస్తున్నారని ప్రైవేట్ దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని సూచించారు. ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు గన్ని బ్యాగులు, మంచినీటి సౌకర్యం, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మిషన్లు మాయిచ్చర్ మీటర్లు వంటి సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీఏ రాజు,వివో అధ్యక్షురాలు మౌనిక,ట్యాబ్ ఆపరేటర్ పోలు భాగ్యలక్ష్మి,సభ్యులు ఉమా,ఏశబోయిన మమత,గుర్రపు వసంత,గ్రామ రైతులు,పెద్దలు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ లో సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం.

**సీకే న్యూస్ ఏప్రిల్ 25 శనివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్**



స్థానిక ధర్మసాగర్ అభ్యుదయ రైతు గ్రామ సమైక్య సంఘం ప్రతినిధి కే లావణ్య ఆధ్వర్యంలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, ఎంపీడీవో అనిల్ కుమార్ హాజరైనారు.స్థానిక రైతులనుద్దేశించి ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, ఎంపీడీవో అనిల్ కుమార్ మాట్లాడుతూ, మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషకరం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన సన్నరకం వరి ధాన్యానికి ప్రోత్సాహంగా 500 రూపాయలు బోనస్ ప్రకటించడం అయినది.వరి ధాన్యమునకు కనీస మద్దతు ధరను పొందాలంటే రైతులు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరి పాటించాలి, దాన్యంలో మట్టి పెల్లలు, రాళ్లు, చెత్త, చెదారం రానివ్వకుండా చూసుకోవాలి, పూర్తిగా మంచిగా లేని దాన్యమును తేకూడదు, ధాన్యము చెడిపోయిన, రంగు మారిన, పురుగులుతిన్న ధాన్యము మార్కెట్కు రానివ్వకూడదు, కొనుగోలు కేంద్రంలో లభించు సేవలను రైతులు ఉపయోగించుకోవాలని, కొనుగోలు కేంద్రంలో రైతులకు త్రాగునీరు, రైతులకు నీడ, విద్యుత్ సౌకర్యము, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు, ఉపయోగించుకోవాలని, స్థానికంగా కొనుగోలు కేంద్రాల్లో వచ్చే సమస్యల్ పరిష్కరించుటకు సహకరించాలి, కమిటీ సేవలను వినియోగించుకోవాలి అన్నారు.తదనంతరం ధర్మసాగర్ సర్పంచ్ కాంట రిబ్బను కట్ చేసి ధాన్యమును కొనుగోలును ప్రారంభించినారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఏనుమాముల మార్కెట్ మెంబర్ బొడ్డు ప్రదీప్ కుమార్, ధర్మసాగర్ ఉపసర్పంచ్ కొంతశీ కొమరమ్మ, ధర్మసాగర్ మాజీ ఉపసర్పంచ్ బొడ్డు అరుణ, కోఆపరేటివ్ మెంబర్ బొడ్డు లెనిన్ ,ధర్మసాగర్ వార్డ్ మెంబర్లు, అభ్యుదయ సంఘం మహిళ సభ్యులు, హమాలి సంఘం ప్రతినిధి జి రాజు, రైతులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ధర్మారెడ్డి పల్లి కాలువ పనులు జాప్యం జరుగుతున్నది.

- **స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవ తీసుకొని కాలువ పనులు వేగవంతం అయ్యేటట్లు చూడాలని రైతుల ఆవేదన.**
- **బిజెపి పార్టీ జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్ సంఘం గ్రామం.**



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 25.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న ధర్మారెడ్డి పల్లి కాల్వ పనులు, కాంట్రాక్ట్ గత సంవత్సరము జూలై నెలలో మొదలుపెట్టి 9 నెలలు గడుస్తుంది ఇంతవరకు కాలువ తలుపులు మరియు కల్వర్ట్ లు సైడ్ గోడలు పూర్తి కాలేదు అని ఇలాగే జాప్యం జరిగితే ధర్మారెడ్డి పల్లి మరియు సంగెం, వర్కట్ పల్లి, గో?కారం రైతులకు నష్టపోతారని ఇప్పటికే ఒక పంట నష్టపోయారని చిన్న, సన్న కారు రైతులు ఉన్నారని ఈరైతులు పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు ఎప్పటికైనా త్వరగా పూర్తి చేసి వచ్చే వానకాలము పంటకు నీళ్లు అందిచలని డిమాండ్ చేసారు ఒక వేల నీళ్లు అందిచకపోతే ధర్మారెడ్డి పల్లి, సంగెం, వర్కట్ పల్లి, గోకారం, రైతులందరు కలిసి పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫిసు ముట్టడిస్తామని పత్రికా ప్రకటన ద్వారా హెచ్చరించినారు.

## యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్న బోథ్ ఎమ్మెల్యే డా. అనిల్ జాదవ్




**అదిలాబాద్ జిల్లా సీకే న్యూస్ ఏప్రిల్ 25**

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు డాక్టరేర్ అందజేత
ప్రజలకు చేసిన సేవ ఊహించని రీతిలో నిలబెట్టిన వైనం
ఆయన సేవే ఆయనను గుర్తించింది
ఆయన కష్టమే ఆయనను నిలబెట్టింది
గిరిజన ఎమ్మెల్యేగా, గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న సేవలు, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్న సందర్భాలు, ఎల్లప్పుడూ ప్రజల కోసం, ఎండనక, వాననక, నమ్ముకున్న ప్రజల కోసం దేన్ని లెక్క చేయకుండా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేసిన సేవలను గుర్తించిన, లియునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ లీడర్షిప్ డాక్టరేట్ ను అందజేసింది.

ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదర్శన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి డాక్టరేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే డా. అనిల్ జాదవ్ మాట్లాడుతూ... ఎల్లప్పుడూ ప్రజా సేవలో కొనసాగుతూ వారి అభివృద్ధికి కృషి చేయడం ఆనందంగా ఉండేదని, ప్రజల్లో కలిసిపోయి ఉండటం ముందు నుంచి అలవాటాని ఆ సేవలే ఈరోజు గుర్తించి డాక్టరేట్ తీసుకునే వరకు తీసుకొచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకుకృతజ్ఞతలు తెలియచేసినజగన్నాధపురం, నరసింహపురం గ్రామ ప్రజలు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**జగన్నాధపురం గ్రామంలోని బీసీ కాలనీ,వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుండి నర్సిపురం రైల్వే అండర్ బ్రిడ్జి వరకు సుమారు రూ.2 కోట్లు 50 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎస్టిమేషన్ సిద్ధం చేస్తున్నారు. ఇది గ్రామ అభివృద్ధికి మరో కీలక అడుగు.రైతులు తమ పొలాలకు వెళ్లడానికి, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో రైతుల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన నూతన రోడ్డు పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న దారి వల్ల , ట్రాక్టర్లు వెళ్లడం కష్టతరమవుతోందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అధికారులు ఈ దారి పొడవునా పర్యటించి, రోడ్డు వెడల్పు మరియు కల్వర్టులు ఎక్కడ అవసరమో మ్యాపింగ్ చేశారు. ప్రత్యేక నిధులతో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.పరిశీలన అనంతరం అధికారులు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. పొలాలకు వెళ్లే దారిని త్వరగా పూర్తి చేసి, రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా చేస్తాం. ఈ పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు పంపి, వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం అనితెలిపారు.కార్యక్రమంలోఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నన్నక శ్రీనివాసరావు, రైతులు తోటకూరి అప్పారావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, జగన్నాధపురం గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్న రమేష్, నరసింహపురం గ్రామ సర్పంచ్ లోయ ఉపేందర్,వార్డ్ సభ్యులు తోటకూర హరీష్, గమిడి శ్రీను,రైతులు బండి సైదేశ్వరావు,బండారుపల్లి మురళి, తోటకూరి సైదేశ్వరావు ,తన్నీరు పుల్లారావు, దొడ్డ అచ్చయ్య, మాజీ వార్డ్ సభ్యులు లంజపల్లి శ్రీను,. కర్రీ వెంకటేశ్వర్లు, అలవాల వెంకటేశ్వర్లు, అలవాల నాగేశ్వరరావు,గమిడి ప్రసాద్, గ్రామ పెద్దలు మరియు రైతులు, తదితరులు. పాల్గొన్నారు.

## బోరజ్ మండలం గుడ గ్రామంలో ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అదిలాబాద్ డిసిసి అధ్యక్షులు గౌ. శ్రీ. డా. నరేష్ జాదవ్ గారు.



**సి కె న్యూస్ ఏప్రిల్ 25** ఆయనతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్అల్లూరి సంజీవ రెడ్డి గారు. మాజీ టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గంద్రత్ సుజాత గారు. డిసిసి ఉపాధ్యక్షులు దీపక్ రావు గారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శాంతన్ రావు గారు. బోరాజ్ మండలం కాంగ్రెస్ నాయకులు మామిడి మల్లారెడ్డి గారు. అల్లూరి భూమా రెడ్డి గారు.
ప్రకాష్ రెడ్డి,రాజన్న,ఆడేల్లు, అశోక్ రఘురాం,లక్ష్మయ్య,చారి గారు. తొడసం దౌలత్ రావు రాదేశ్యం గారు పాల్గొన్నారు.

## కములుద్దీన్‌లో ఇందిరమ్మ ఇండ్లకు కొత్త కళ - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చొరవతో లబ్ధిదారుల గృహప్రవేశాలు.



**సి కె న్యూస్ ఏప్రిల్ 25 వనపర్తి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**వనపర్తి జిల్లా, ఖిల్లా ఘనపూర్‌లి: ఖిల్లా ఘనపూర్ మండలం కములుద్దీన్ గ్రామంలో పేదల సొంతింటి కల సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహాల్లోకి లబ్ధిదారులు శనివారం ఘనంగా గృహప్రవేశం చేశారు.

ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు శ్రీ తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులను అభినందించారు. శుభ సందర్భంగా వారికి నూతన వస్త్రాలు అందజేసి, కొత్త జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, “ఇది కేవలం ఇల్లు కాదు, పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇండ్లతో రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. లబ్ధిదారులందరికీ శుభాకాంక్షలు” అని తెలిపారు.

గృహప్రవేశాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# త్రాగునీటి సరఫరా పై హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి..

- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో నిరంతర నీటి సరఫరా నిర్ధారించాలి..
- నాలుగు రోజుల్లో పెండింగ్ త్రాగునీటి సమస్యల పరిష్కరించాలి.
- జిల్లా కలెక్టర్ అంకిత్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25,** వేసవికాలంలో త్రాగునీటి కొరత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హెల్ప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం ఐడీఓసీ కార్యాలయం నుండి నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా భద్రాచలం పి.ఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలెక్టర్ వేసవిలో త్రాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో త్రాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదేనని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి గ్రామానికి నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి మండలం, గ్రామంలో బోర్‌వెల్లు, చేతి పంపులు వంటి ప్రత్యామ్నాయ వనరులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు.

మోటార్లలో లోపాలు తలెత్తినపుడు తక్షణమే మరమ్మతులు చేయడానికి అదనపు మోటార్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు.

జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, ఎంఆర్ఓ కార్యాలయా ల్లో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో చివరి దూర ప్రాంతాలకు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే గరిష్టంగా 24 గంటల్లోపు పరిష్కరించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్లు ప్రతి వార్డులో ఉదయం నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

అనంతరం మండలాల వారీగా త్రాగునీటి సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గుత్తికొయ హ్యాబిటేషన్లలో సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాల్వంచలో 55, చర్లలో 54, దుమ్ముగూడెంలో 55 త్రాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణలో వాటిని ఎందుకు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారా? ఇంకా పనులు పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు.

నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేస్తూ, నాలుగు రోజుల్లోపే అన్ని త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా ఆదేశించారు. రానున్న మూడు నెలలు అత్యంత కీలకమని , ఎక్కడా నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న త్రాగునీటి సమస్యలపై సమగ్ర నివేదికలు సమర్పించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## మంత్రి అయినా మట్టిని మరిచిపోలేదు ట్రాక్టరతో తోదుక్కి దున్నిన మంత్రి జూపల్లి.



**సి కె న్యూస్ వనపర్తి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

ఖరీఫ్ సన్నద్ధతలో రైతులకు ఉత్సాహం నింపిన పర్యాటక శాఖ మంత్రి.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం రైతు అవతారమెత్తారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో కొల్లాపూర్ మండలంలోని తన సొంత వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ దుక్కి దున్నారు.

మంత్రి హోదాలో ఉన్నా పొలం పనులకు దూరం కాలేదని ఆయన నిరూపించారు. విత్తనాలు వేసేందుకు నేలను సిద్ధం చేస్తూ తోటి రైతుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "మంత్రినైనా రైతు కష్టం నాకు తెలుసు. రైతు దేశానికి వెన్నెముక. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజును చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్ కంచం ద్రౌపది.




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మత్కేపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, ఎండ తీవ్రత దృశ్య కూలీలు పనిచేసే చోట టెంట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు పనిచేయాలని తెలియజేయడం జరిగింది.

ఈనాటి కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ చైర్మన్ కంచం కోటేశ్వరరావు , యూత్ సభ్యులు నర్సింశెట్టి చలమయ్య , ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.?

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్ కంచం ద్రౌపది.




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మత్కేపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, ఎండ తీవ్రత దృశ్య కూలీలు పనిచేసే చోట టెంట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు పనిచేయాలని తెలియజేయడం జరిగింది.

ఈనాటి కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ చైర్మన్ కంచం కోటేశ్వరరావు , యూత్ సభ్యులు నర్సింశెట్టి చలమయ్య , ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన, గ్రామ సర్పంచ్



**ఏప్రిల్ 25 (సీ కే న్యూస్)** చేగుంట మండలం బోనాల గ్రామంలో సరిత,రమేష్ దంపతుల,గృవా ప్రవేశం లో రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి,గృహ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో పేదలకు సహాయపడి నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,గ్రామ సర్పంచ్ సుకన్య , హోసింగ్ ఏ ఈ రియాజద్దీన్,గ్రామ పంచాయతీ సెక్రటరీ రేణుక ,ఉపసర్పంచ్ నాగరాజు ,తో కలిసి ప్రారంభించారు,ఈ కార్యక్రమం లో ,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్,ఎఎంసి డైరెక్టర్లు అన్నం ఆంజనేయులు,మోజమిల్, స్టాలిన్ నర్సిములు,మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు దండు శంకర్, రాంచంద్రం,,గ్రామ అధ్యక్షులు పుల్ల రమేష్, ఉపాధ్యక్షులు సంతోష్, సినియర్ నాయకులు సంతోష్ యాదవ్,వార్డు సభ్యులు,భూపతి, నరేష్,,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఓపెనింగ్ కార్యక్రమం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** :జగన్నాథపురం గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో చలివేంద్రం రిబ్బన్ కట్ చేసి ఓపెనింగ్ చేసిన గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న

ఈ కార్యక్రమానికి. మత్తేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండెల నాగార్జున. గ్రామ ఉపసర్పంచ్ అలవాల శ్రీదేవి. గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణమాచారి. వార్డు సభ్యుల తోటకూరి హరీష్ . గ్రామ పెద్దలు తోటకూరి నాగేశ్వరావు. తాళ్లూరి రమేష్. మండేపూడి కిషన్ రావు. మండేపూడి విజయ్. అలవాల నాగేశ్వరావు. గుడిపూడి నరసింహారావు. బండారుపల్లి రంగారావు. కాశీ మాల శ్రీను. గమ్మిడి ప్రసాద్. కాశీ మాల గోపి. కొండ. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఏడవ రోజుకు చేరిన భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు



**వరంగల్ (సీ కే న్యూస్) ఏప్రిల్ 25**వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ రోజుతో ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి గం॥ 4-00లకు నిత్యాహ్నికం నిర్వహించిన తదుపరి చతు: స్థానార్చన జరిపిన తర్వాత అమ్మవారికి గంధోత్సవం, సాయంకాలం సాలభంజిక వాహనం పై అమ్మవారిని సామ్రాజ్యలక్ష్మిగా అలంకరించి ఊరేగింపు జరిపారు. అమ్మవారికి చందనోత్సవం జరుపడం వల్ల భక్తులకు శ్వాసకోశ సంబంధమైన చర్మ సంబంధమైన ఏలాంటి రుగ్మతలు ఉండవు. సాలభంజిక వాహనం మీద 32 మంది దేవకన్యలు వేసే ప్రశ్నల వర్షానికి ప్రత్యుత్తరమిస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తన సర్వజ్ఞత్వాన్ని తెలుపుతుంది. సాలభంజిక వాహనం మీద సేవింపబడుతున్న అమ్మవారిని దర్శిస్తే సకల శక్తులు సమకూరుతాయి. విద్యా, ఐశ్వర్యం, పరాక్రమం, అధికారం అన్నీ సమకూరుతాయి. సామ్రాజ్యైశ్వర్యం కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. దేవాలయానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, చల్లని త్రాగునీరు, అమ్మవారి దర్శనం తదితర ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, చైర్మన్ డా॥ బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు శ్రీ గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, శ్రీమతి గాండ్ల స్రవంతి, శ్రీ ఓరుగంటి పూర్ణచందర్, శ్రీ తొగరు క్రాంతి, శ్రీ జారతి వెంకటేశ్వర్లు, శ్రీ అనంతుల శ్రీనివాస్, శ్రీ మూగా శ్రీనివాస్ రావులు పర్యవేక్షించారు.

ఈ రోజు కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయానికి విచ్చేసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు వందలాదిగా వరంగల్ జిల్లా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీ కటకం పెంటయ్యగారి నేతృత్వంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకులు శ్రీ గోపాల నవీన్ రాజ్ లు మేళతాళాలతో పట్టుచీరలు, పూజాద్రవ్యాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించి పూజాదికములు నిర్వహించి అభిషేకములు నిర్వహింపజేశారు. నారీమణులు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం 2000 మంది భక్తులకు మహాన్నదానం శ్రీ గోపాల నవీన్ రాజ్ దాతగా వ్యవహరించి నిర్వహించారు. ఈ రోజు కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం ప్రముఖులలో మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీ గైనేని రాజన్, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కొండ దేవయ్య, శ్రీ జారతి వెంకటేశ్వర్లు శ్రీ తొగరు క్రాంతి శ్రీ మూగ శ్రీనివాసరావు, శ్రీ మణికొండ వెంకటేశ్వర్లు, శ్రీ కొండూరి వినోద్ కుమార్, శ్రీ మీసాల ప్రకాష్, శ్రీ మూలా రాంమూర్తి, కార్పొరేటర్లు శ్రీ ప్రవీణ్, శ్రీ ముస్కుమల్ల అరుణ-సుధాకర్, పల్లం పద్మ-రవి, శ్రీ కేడల పద్మ- జనార్ధన్, శ్రీ పగడాల సతీష్, శ్రీ బత్తుల నవీన్, శ్రీ కనుకుంట్ల రవికుమార్, శ్రీబక్కి రాజ్ కుమార్, శ్రీ పాటి శ్రీనివాస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సాయంకాలం అమ్మవారి సాలభంజిక సేవ బంజార సమాజం ఆచార్య అజ్మీరా సీతారం నాయక్, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆధ్వర్యవమున నిర్వహించబడింది.

ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో కుడా చైర్మన్ శ్రీ ఇనుగాల వెంకట్రాం రెడ్డి దంపతులు తదితరులున్నారు. పూజానంతరం కుడా చైర్మన్ దేవాలయం చుట్టూ నిర్మాణం జరుగుచున్న మాడవీధుల పురోగతిని శ్రీ అజిత్ రెడ్డి, భీంరావులను ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీ శ్రవణ్ కుమార్ రెడ్డి, పూర్ణచందర్, శ్రీమతి గాండ్ల స్రవంతి, శ్రీ బింగి సతీష్ తదితరులున్నారు.

## కీర్తిశేషులు రేపాక పూలాదేవి గారి దిశదినకర్మలో పాల్గొన్న ప్రముఖులు మండల నాయకులు జిల్లా నాయకులు.










**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 25.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో ఉన్న రెడ్లరేపాక గ్రామానికి గ్రామ అభివృద్ధి ప్రదాత కీర్తిశేషులు పూలాదేవి గారు అనారోగ్యం చేత పరమపదించినారు.

వారి దిశ దినకర్మ స్వగ్రామం రెండ్లరేపాకాలో ఘనంగా వారి కుటుంబ సభ్యులు రేపాక ప్రదీప్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని పెద్దకర్మ నిర్వహించినారు.

ఈ కార్యక్రమంలో వలిగొండ మండల రిపోర్టర్లు మండల నాయకులు జిల్లా నాయకులు ప్రముఖులు అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి తెలిపినారు .